# ఉబలాటం

[కథానిక]

శ్రీ కొవ్విడి లక్ష్మన్న

పట్టుమని పదినిమిషాలు పట్టదు. మా యింటినుంచి ఎయిరోడ్రోముకి. రావుణ్ణి దిగబెట్టివచ్చి అలా యీజీఛెయిరులో నడుంచేరేసేను. నిమషంలో మూడూ కొట్టింది గడియారం. పొద్దున్న చేసినవి రెండు బొబ్బట్లూ, యింత పులిహోరా, ఓ గ్లాసుడు కాఫీ చిన్న చందనపు ట్రేలో అమిర్చి తెచ్చి, ప్రకనొనున్న ఆగ్రా బల్లమీద ఉంచింది జానకి.

"మీ కాఫీలయినాయేవిటి ?" అన్నాను.

"తనకుమాలిన ధర్మంవూ మొదలుచెడిన బేరవూ వుంటుందా ?" అంటూ వసారాలో ఉన్న చిట్టిపిల్ల దగ్గరికి పోయిందామె. అలవాటుచొప్పున అనేసేను. చిట్టిపిల్లంటే యెవరో చంటిపిల్ల అనుకునేరు ! మా రావుడిభార్య. చిన్నప్పుడు, చిట్టీ చిట్టీ అంటూండేవారు. మరి నాలుగేళ్లకి చెల్లెలు పుట్టేసరికి ఎడపిల్ల చిట్టిపిల్లా, చంటిపిల్ల బుచ్చిపిల్లా అయివూరుకున్నారు. ఆ పేర్లు అలా చిరస్థాయిగా ఉండిపోయేయి, మరి ఇహానిప్పుడు పిల్లతల్లి అయినా చిట్టిమాత్రం చిట్టిపిల్లేను. నాలుగో పది నడుస్తున్నా పిలవడం లేదూ, "బుచ్చి బాబూ" అనీ. అలాగే...చూశారా, ధోరణిలో పడిపోతున్నాను! నాతో తంటేయింత. మొదలెడితే యిహాను అంతుఅంటూ ఉండదు. అలాగ వాగేస్తు ఉండవవేను. సరే, యీ గొడవకేంలెండి.

అసలేవిటి చెబుతున్నానూ ?

ఆ, ఫలహారంమాట. జానకీ చిట్టిపిల్లా వసారాలో కూచున్నారు, వెండిపళ్లెం ముందెట్టుకొని. వాళ్లనిచూసి నేనూ ఆరంభించేను రేషను ప్రాబ్లెం తగ్గించడానికి. ప్రాబ్లెంమాట యెలాగవున్నా, రేషన్లుమాత్రం నిస్సంశయంగా తరుగు దలమాపించసాగేయి. అంతలోకే వసారాలో మాటలు ఏవో అస్పష్టంగా నాచెవినీ పడ్డాయి. నిమషంలో కిలకిలనవ్వు !

"ఏవిటి జానకీ అలా పొంగిపోతున్నారూ ?"

"రామంగారి పుట్టినదినం వచ్చే నెల్లో యెనిమిదిన్నట. ఇవాళ చేయించేసేరు మీరు."

"తెలుగులెక్కల ప్రకారం యివాళేనూ, అషాఢశుద్ధ పాడ్యమి కాదూ ?"

"కాబోలు" నంది చిట్టిపిల్ల.

"'మహల్'కి తీసుకువెళతారా ?" జానకి అడిగింది.

"ఎవరా తీసుకువెళ్లడం, వాడా ? నేనా ?"

"పొద్దుట్నుంచీ సరంజాం అంతా యెవరు చేయిస్తూఉంటే, వాళ్లే తీసుకెళ్లాలి మరి, సినీమాకిన్నీ" —చిట్టిపిల్లదా జవాబు.

"అబ్బో. పేరుకి చిట్టిపిల్లగాని, పిల్లవేమో గడుసుదానివే నమ్మోవ్ !" అంది జానకి నవ్వుతూను

అలాగ కబుర్లుచెబుతూ టిఫిను పుచ్చుకుంటూనే ఉన్నాను. అంతలోనే ఒక్కసారి గాలి వేసి తలుపు తపీమని కొట్టుకుంది. కిటికీ తిన్నె మీద పెట్టిన నీళ్ల

గ్లాసు నేలని "భోల్లు"మంది. చేటలతో చెరిగినట్టు ఊః దుమ్ము చెలరేగిపోయింది. ఇంటినిండా ఒకటే యిసక! అది గాలీ పరగడా కాదు!! గభాల్న పరుగెత్తుకువెళ్ళి జానకమ్మా చిట్టిపిల్లా నిమిషంలో మూసేసేరు, అద్దాల తలుపులు.

"అబ్బబ్బ! ఏమిటీ గాలీ, పరగడానూ! పట్టపగలు చిమ్మచీకటైపోయిందీ?" అంది చిట్టిపిల్ల.

"ఈవైపు యింతేనమ్మా. ఓమూలనుంచి ఫెళ్లున యెండకాస్తూనే వుంటుంది. అతాత్తుగా దూరాన్ని యెఱ్ఱని ధూళిమేఘం ఔపిస్తుంది. పార్కుల్లోనూ అక్కడా కూచున్నవాళ్లు "ఆంధీ" వస్తోందంటూ గబగబా యిళ్ళకి దారితీస్తారు. అంధకారంవే అనుకో. గంటకి అరవై డెభ్భై మైళ్ల స్పీడులో వస్తుందంటే, ఊహించుకో అఘోరు! దాని గమనంలోకూడా చిలవలూ పలవలున్నా. మొదట్లో కుంకం ఆరబోసినట్టు కనిపించినదల్లా, దట్టంవయి, నల్లబడి ఒకవేపునుంచే అతిత్వరితంగా వెంట తరుముతూన్నట్టు కనిపిస్తుంది. అంతలోకి ఆవేపునుంచి యీవేపు మళ్లినట్టు అనిపిస్తుంది. చూస్తూఉండగానే అందులో సుళ్లు బయలుదేరుతాయి. ఎదురుగా వంద గజాల్లో రివ్వుమంటూ తాటిచెట్టుపరిమాణాన్ని యిసక స్తంభం ఒకటి యేర్పడుతుంది. స్ప్రింగు తీగల్లాగ అందులో ఆకూ అలమూ, చెత్తచెదారం గిర్రున తిరుగుతాయి. రోడ్డుచివర కనబడిన ఆ సుడి చూస్తూఉండగానే వానావానా చెల్లప్ప తిరుగుతూవచ్చి మనలని చుట్టబెట్టేస్తుంది. ఇహ నానాకంగాళీనీ. కళ్లనిండా, నోళ్లనిండా, యిళ్లనిండా, అది దుమ్ము కాదు. ఆ భీభత్సం అయేక పూర్తిగా పూటపడుతుంది. యిళ్లు తుడుచుకుని కడుక్కునేసరికి ఆ మర్నాడు తల రుద్దుకుందాం అని కుంచెడు కుంకుడుకాయలు నానవేసినా సుప్పిడుజుట్టు వదలదు.

"మరి యీ జీమూతంలో వాళ్ళు ఆ ప్లేను యెలా నడుపుతారో?" నంది జానకి.

"అంత ఖంగాళీపరిస్థితుల్లో వెళ్లే వెళ్లవూ, విమానాలు" చిట్టిపిల్ల జవాబిచ్చింది.

"అది సరేలే, తీరా బయలుదేరినతరువాత దారిలో దుమారం వస్తే?"—జానకి మళ్లీ అడ్డుసవాల్!

ఆ మాట చెవినిపడేసరికి ఫెళ్లున చరిచినట్టయి, మతికాస్తా పోయింది నాకు!!

౨

అంటూనే ఉన్నాను, "రేపు డ్యూటీలో చేరిన తరువాత ఆఘోరించకూడదుటోయ్!" అని. అశ్చే నా మాట వినిపించుకుంటేనా? వాడికి యెంత తోస్తే అంతే. వాడితో గొప్ప చిక్కే అది, ఏమిటో ఆ వెర్రిసరదా. సరదా యేమిటి నా మొహం. చెబుతున్నాను కదూ? ఉన్నట్టేఉండి గభాల్న యెక్కడో బుర్రలో ఒక సీల జారిపోతుంది గాంవుడికి. ఇహ సరి చిన్నపిల్లడికన్న కనికిష్టం అయిపోతాడు. అపాళంగా వాడి మనసులో సంకల్పించుకున్న పని అయిపోవలసిందే.

లేకపోతే ఏమిటనుకోను చెప్పండీ! మొన్నటిదాకా డ్యూటీలో ఉన్నాడాయిరి. రెండు రోజుల క్రితం విమానం నడుపుకుని కాశ్మీరంనుంచి వొచ్చేడు. నిన్న అంబాలానుంచి వచ్చినప్పుడుకూడా విమానంలో వస్తూ, దాన్నీ తనే నడుపుకు వొచ్చేడు, స్వేచ్ఛలుగా పెళ్ళమను పుట్టించుకుని. ఇంతలోకే యేం కొంప మునిగిపోయిందనీ? వెధవ ప్లేను పుస్తెకట్టిన పెళ్లాంవా అంత అట్టిపెట్టుకు తిరగడానికి? నిజంగా పుస్తెకట్టిన దాన్నిగురించి అంతగా పట్టించుకోడు!

నిన్న విమానం దిగేడు. సామాన్లు కారులో పెడుతూవుంటే యెండ్లో తగులబడ్డాడు, బాతాఖానీ రాయుడు. వీడిలాంటివాడే వాడూను! బస్. ఉభయులూ కబుర్లలో పడ్డారు—చిట్టిపిల్ల గొంతుక చింపుకుంటూనే వుంది, 'కాఫీ లేక గుడ్లు గూట్లోకి వొస్తున్నాయి. ఈపాటుకి చాలించండి ఆ భారతం' అని. కానీ, అశ్చే వాళ్ల గొడవే వాళ్లది. ఎంతసేపూ "డకోటా, డకోటా". కొత్త ప్లేను. సరికొత్తది; నిన్ననే వొచ్చింది. దాన్ని నడపడానికి కిణ్ణి నియమించి, ప్రత్యేకించి పిలిపించేరు. ఇదీ రంధి. దాన్ని తనే ఓంప్రథమం నడపాలి; అప్పటికిగాని లభించవు,

శంఖుచక్రాలూ భుజకీర్తులున్నూ. ఏం వి పుట్టినులిగి పోయిందనీ ! మర్నాడు అధికారి యెలాగా వస్తాడు: తనని ఆపనికి యెలాగా నియోగిస్తాడు. అసలు ఉద్యోగంవే అదిగా. అంతమాత్రానికి యెందుకో యీ వెల్లలు వేసుకుపోవడం!

రాంవుడికో అదే తంటా.

రాత్రినుంచీ నా ప్రాణాలు తినేసేడు, "పొద్దున్నే ఓసారి ఎయిరోడ్రోముకి వెళ్లాలి, బుచ్చిబాబూ."

"అలాగేన్లే. మీ ఆఫీసరు రేపుసాయంత్రానికి గాని తగులడడుగా? కాకపోయినా, ఎల్లుండి నువ్వు డ్యూటీలో జాయినుకావడం."

"అయితేనేంలే. రేపొద్దుటు వెళ్లి-"

"వెళ్లి?"

"కొత్తప్లేను చూసిరావాలి."

"ఆ అచ్చివాకులతనంవే మానమన్నాను. ఏనాడూ ప్లేను మొహం ఎరగనట్టు!"

"అది కాదు బుచ్చీ, కొత్తప్లేనూ"-

"—లూరుకో. దానికి మూడు ముక్కులూ నాలు కొక్కుమ్ములూ వుండవు" వాడికి విసుగెత్తింది-"నువ్వెన్నైనా చెప్పు, అబ్బీ, ఆ ప్లేను ఓసారి చూసేదాకా మరి నాకు నిద్దరపట్టదు."

"కంట్లో వొత్తేసుక్కూచో. ఏళ్లొచ్చినా చిన్నతనంమాత్రం పోయింది కాదు"

"రేపు ఒక్కరోజు కాదుటయ్యా. కాకపోయినా అంత యిదయిపోతాంవేంవిటి, పదినిమిషాలు అలా షికారు వెళ్లొద్దాం అంటేను"

ధోరణి తప్పించేసేను. మాటలసందర్భంలో తెల్లవారితే వాడి పుట్టినదినం అని తేలింది. బాగా దొరికింది అదను అనుకున్నాను. తలంటిపోసుకోవాలని కాస్సేపూ, రెక్కలువిరుచుకుని చేసిన నాలుగు వస్తువులు కాస్త తినకపోతే యెలాగరా అని మరికాస్సేపూ ఆలస్యం చేసేసేను. భోజనా లయేసరికి పన్నెండూ కొట్టేరు.

"ఇహ నేం వెళతావులేరా యెండలోనూ" అన్నాను. కాని, ఛఫ్. వాడి మనసంతా ఎయిరోడ్రోములోనే వుందాయిరి. ఆపాళంగా బట్టలు తొడుక్కుని బయలుదేరేడు. నన్నూ లెమ్మని, లేచేదాకా ప్రాణాలుతినేసేడు. ఇహను యేలాగా తప్పదనుకుని వాడితో ఎయిరోడ్రోముదాకా వెళ్లేను. వాడికి మరి దారి తెలియదాయిరి.

నిజంవే; వెండి పోతపోసినట్టు తళతళ మెరిసిపోతోంది ప్లేను. కాక్‌పిట్టు, మైకాముక్కలు అసలు ఉన్నాయా లేవా అన్నంత క్లీనుగా ఉన్నాయి. పక్కవాటుగా "మార్కండేయ" అని దానిపేరూ, దానికి కాస్త దూరంలో యింకా పెద్ద అక్షరాలతో రాసిన కంపెనీ పేరూ, రెక్కలక్రింద మూడు రంగులతో వున్న మార్కింగులూ నెంబర్లూ - మర్నాడు గృహప్రవేశం అనగా ముగ్గులూ అవీ పెట్టి అలంకరించిన యింటిలాగ కళకళలాడుతోంది అది. లోపల యేవో మీటలూ, మీటర్లూ హేడ్‌ఫోన్లూ అదంతా అదో ప్రపంచం! నాకే చూడ ముచ్చట అనిపించింది. మా రాంవుడయితే తన్మయత్వం చెందిపోయి, శిలంయెత్తిపోయేడు. ఆపాళంగా "ఓసారి ట్రయిలుతీసుకురానా?" అంటున్నాడు యెవడితోనో!

"కంట్రోలరుకి తెలియకుండానే?" అన్నాడాయన.

"ఇట్టేరానూ, ఎంతసేపు!"

"రేపట్నుంచీ యెలాగా మీ చేతుల్లోనే ఉంటుంది కదుటండీ."

"ఇవాళనుంచే వుండాలనికదూ."

"ఏంవి ఉబలాటంఅండీ మీకు!" అన్నాడాయన.

"మావాడికి కొసవెర్రి!" నేను కప్లిమెంటు చేసేను.

"ఏం సెలవుమరి, బయలుదేరనా?" సగంలో ఆపేసిన పల్లవి రాంవుడు మళ్లీ అందుకున్నాడు.

"మీ కంత యిదిగా ఉన్నప్పుడు నే నేంవని కాదంటానూ ! సరే, వెళ్లిరండి. కాని అయిదోగంట

కొట్టకుండా రావాలిసుమండీ! చెప్పకుండా తీసుకెళ్లేరన్నమాట పెద్దవాడిచెవిని బడితే మరి ఆబోరు దక్కదు."

"నువ్వుకూడా కూచుంటావా, బుచ్చీ" అన్నాడు రాంవుడు.

"నువ్వు బావుకో, బాబూ, ఆ పాయసం. నాకిక్కల్లేదు. యింటికి పోయి కాస్త నడుం వాలుస్తాను."

"పెట్రోలు చూసుకున్నారా. టేంకు ఫుల్‌గా లేనట్టుంది, అంటూనే ఉన్నాడాయన, అంతలో మావాడు, హనుమంతావతారం దాల్చి వింగుమీదనుంచి గెంతి, కాక్‌పిట్‌లో దూరి స్టార్టరుస్విచ్ నొక్కేసేడు. ప్రొపెల్లర్లు 'ఓం' అంటూ మోత సాగించేయి.

అదుగో, అక్కడే నా బుర్ర పనిచేసిందికాదు. ఎంత దూరం వెళతావు? పెట్రోలు యెంత ఉంది? ఎన్ని మైళ్లొస్తుంది? మళ్ళీ యెప్పుడు తిరిగివస్తావు? యిలాగ నాలుగుసంగతులూ కనుక్కోవచ్చునా? అబ్బే ఒక్కమాటా నోట పెగల్లేదు. ఏ సంగతీ వివరం తెలుసుకోలేదు. వాడి పుట్టినదినానికని చేసిన ముక్కాముట్రాతో కొంచెం భారీగా భోంచేశేనేమో, చిన్న తూగు వొచ్చేస్తోంది. కళ్ళు బరువెక్కి పోతున్నాయి. ఎంత వేగిరం యింటికి వెళ్లి నడుం వాలుస్తానా అనిపించింది. అంతే వాడలాగ టేకాఫ్ చేశేడు, నేనిలాగ యింటిమొహం పట్టేను.

## 3

"గాలీ పరగడా వస్తే యింత అల్లకల్లోలం అయిపోతుందిగదా, మరి ఆ విమానాలు యెలా నడుపుతారో" అని జానకి అనేసరికి ఒక్కసారి యీ సంఘటన అంతా నెమరుకి వచ్చి కొయ్యబారిపోయేను. కాళ్లాడలేదు. వొంటినిండా ముచ్చెమటలూ పోసేసేయి. ఆ మట్టుగా విల్లింగ్డను ఎయిరోడ్రోముకి పరుగుచ్చుకున్నాను. పది నిముషాల్లో చేరుకోవలసింది పావుగంట పరిగెత్తినా కంట బడదేం? అబ్బబ్బ! వెధవ యిసక! సూదుల్లాగ కంట్లో గుచ్చుకుంటోంది. దిక్కుమాల్ని పంచె ఒహాటే, అడ్డదిడ్డంగా మోకాలుపైకి ఎగసుకుపోయి, గోచీకొంగు బిగుసుకుపోతూను! ఉంహ్. గ్రహచారం.

తీరా చేరుకునేసరికి డేంజరుసిగ్నలు యిచ్చేరనీ ఏవిమానం అక్కడ దిగడానికి వీల్లేదనీ తెలిసింది. క్లియరుసిగ్నలు యిచ్చేసరికి పావుగంట పట్టింది. కలకత్తానుంచి వచ్చిన ఓ ప్లేను దిగింది. మా వాడిది ఫికరు లేదు. వాళ్లనీ వీళ్లనీ వాకబుచేసేను.

"పాలం ఎయిరోడ్రోములో దిగేడేమోనండీ" అన్నారొకరు.

ఆయనంటే సులువుగా అనేసేడుగాని, ఆపాలం మాత్రం అందిపుచ్చుకున్నట్టుందా? పిట్టలాగ యెగిరే విమానానికి పట్టుమని నిమిషం పట్టదు. కాని నాబోటిగాడికి, రోడ్డుమీద ఏడుమైళ్ళు తీర్థయాత్ర. అదైనా సమయానికి బస్సుదొరికి, సగంలో ఫెయిలవకుండా వెళితేను! ఏం చెయ్యనూ? ఇంక గత్యంతరం లేదు. వెళ్లక తప్పిందికాదు. ఫలితంమాత్రం శూన్యం. రాదనుకున్న ఫారనుప్లేను సడెన్‌గా వచ్చింది. వస్తుందేమోననుకున్న మా వాడి విమానం అయిపులేదు. ఎంతసేపు అలా కాసుకూర్చోను? టైము వేస్టయిపోతోంది.

పుట్టినదినంనాడు - అందులోనూ డ్యూటీ లేని రోజున - హాయిగా యింటిపట్టున ఉండకుండా ఏంవి ఖర్మంవో వాడికి! సరిగ్గా పదేళ్ల క్రితం యిలాగే కలుసుకున్నాం. సుష్టుగా భోంచేసి కబుర్లు చెప్పుకుంటూన్నప్పుడు చెవిని పడేసేడు, తను పైలటు కోర్సుకి వెళుతున్నాననీ, జాతకం చూడమని. చూసేదాకా మరి నిద్దరపోనిచ్చేడు కాదు.

జాతకంమాట అనుకునేసరికి ఛప్పున స్ఫురించింది ముప్పైమూడో యేట వాడికి వాయుగండం. అప్పట్లో సరిగా ఊహించుకోలేకపోయేను. వాయుగండంఅంటే యిదేకాబోలు. అన్నా! ఇవాళేనా యేంవిటి చెప్మా! ఎంత ఘోరం, ఎంత ఘోరం!!

ఇహ నక్కడ నిలచోలేకపోయేను. ఏంవి చెయ్యడానికీ పాలుపోయిందికాదు. మళ్లి ఓసారి విల్లింగ్డను ఎయిరోడ్రోముకి వెళ్లి చూస్తేనో? ఈ అరగంటలో నే

వచ్చేసి ఉంటాడా? అసలు యింతకీ బతికివున్నాడో లేదో? అలా తర్జనభర్జన పడుతూనే ఉన్నాను. బస్సు మా వీధిమలుపులో ఆగింది. అనుకోకుండా కాళ్ళు యింటిదారి బట్టేయి. బుద్ధికి జడత్వం ఆపాదించుకు పోయింది. శవప్రాయంగా యిల్లు చేరుకున్నాను.

## ౪

గాలిసద్దు అణిగింది. వీధితలుపులు బార్లా తీసి వున్నాయి. కంగారుగా లోపల అడుగుపెట్టేసరికి— నా కళ్లు నేనే నమ్మలేకపోయేను. రాఁవుడు! రాఁవుడే. గుండులా కుర్చీలో కూచునున్నాడు.

"హారినీ థస్సా రవలా! ఏఁవయిపోయేవో అని హడిలిపోయేను."

"అక్కడికి నేనే సిగపువ్వు వాడకుండా వచ్చి నట్టు!" అన్నాడు రాఁవుడు.

"అయిందీ. అనుకున్నంతపనీ జరిగిందన్నమాట"

"నువ్వేఁవనుకున్నావో గాని, బుచ్చిబాబూ, నేననుకున్నట్టు ఒక్కపనీ జరగలేదు."

"ఏం?"

"ఆమట్టుగా టేకాఫ్ చేసేనా? మీరటు వెళ్లొద్దాం అనుకున్నాను."

"మరే, నేనూ అదే అనుమానించేను."

"నీది ఒట్టి అనుమానఁవే మరి. విను. మీరటు పొలిమేరలకి వెళుతున్నా ననేసరికి పెట్రోలుమాట జ్ఞాపకం వచ్చింది. ఫ్యూయల్ మీటరు చూసేను. అనుమానం వేసింది. మధ్యదారిలో పెట్రోలు అయిపోయిందంటే ఉరెట్టుకోవాలికదూ, మరి! దానికితోడు ఎవరు నుంచి గాలిదుమారం వస్తూన్నట్టు తోచింది. ఎందుకయినా మంచిదని తిరిగిపోయేను. కాని ఢిల్లీప్రాంతం చేరుకునేలోపల వెంట తరుముతూవచ్చింది గాలి. అంతలో డేంజరుసిగ్నలు. ఆకాశంలో చక్కర్లుకొడుతున్నాను. పాలం-విల్లింగ్డన్ల మధ్య పదిమార్లయినా తిరిగివుంటాను. మేఘులో ఎడారిలాగ ఢిల్లీ యావత్తూ ఒకహాటే మట్టిరంగు! చెట్టుపల్లాలు ఏఁవీ దృగ్గోచరం కాలేదు. ఇహ సరి. పెట్రోలు నిండుకుంటోంది. ఎంత మహాయిదైనా యింక పదినిమిషాలకన్నా యెక్కువ సేపు రాదు. ఊః గాలి తోసేస్తుంది.

'పెట్రోలు చూసుకున్నారా. అట్టే లేనట్టుంది టేంకులో' నన్న అతని మాటలు గుర్తొచ్చేయి. నిజఁవే. కాస్త పెట్రోలు పోయించుకున్నా తీరిపోయేది. ఏఁవనుకుని ఏం లాభం! అప్పటి కష్టఁవే గాభరా పుట్టింది నాకు. ఏదైనా అభాసు జరిగితే? లక్షల విలువగల ప్లేను. అటువంటి సమయాల్లో నిజంగా అభాసు జరిగినా, ప్లేను తగులబడి ప్రాణాలు మిగిలిపోతాయి. యింక మరి తలయెత్తుకుతిరగడానికి వీల్లేకుండాను.

'నువ్వన్నట్టు యింటిపట్టునైనా ఉండిపోయేను కాదు. ఆఁ! నీమాట అనుకునేసరికి, పొద్దుట చేసిన విందుభోజనఁవూ, పుట్టినదినఁవూ మనస్సుకి తట్టేయి. దాంతో లోగడ నువ్వన్నమాట-యివాళా నిన్నానా పదేళ్లనాటి మాట! అదే. నాకు ముప్పైమూడోయేట గండం ఉందన్నావు, జ్ఞాపకం వుందీ-అది ఛటాల్న స్ఫురించింది. చెప్పడఁవే ఆలస్యం అవుతోంది అనుకో: యింతా రెప్పపాటుకాలంలో జరిగిపోయింది. కళ్లంట నీళ్లు రావడఁవే తరవాయి. నొచ్చేయేమోకూడాను. 'లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, ప్రాణంబుల్ ఠావుల్'దప్పిన పరిస్థితే ఏర్పడింది.

'అంతలో క్లియరుసిగ్నలు!

'అమ్మయ్య! అనుకున్నాను. ఆపాళంగా ఒక్కసారి స్విచ్ ఆఫ్ చేసి, ప్లేను దిగడనిచ్చేను. సరి. ఏటవాలుగా వచ్చి రన్వేలో దిగింది విమానం. అజోరుకి అదే అలా పరుగెత్తుకువెళుతూవుంటే, పాతికగజాల్లో మళ్లించి హేంగరువేపు తిప్పేను. హేంగరు నాలుగ్గజాలుందనగా ప్లేను ఆగిపోయింది. బతుకుజీవుడా అని ఆపాళంగా వింగుమీదనుంచి కిందికి దూకేసేను.

'క్లియరుసిగ్నలు యివ్వడం మరో రెండు నిమిషాలు ఆలస్యం అయిందో, యిహ నాగతి-ఎందుకూ? చెబితే అబద్ధం అనుకో. టేంకులో ఒక్క చుక్క లేదు పెట్రోలు.

'అక్కడున్న నలుగురం సాయంబట్టి దాన్ని లోపలికి తోసేసేం."

"అయితే విల్లింగ్డను ఎయిరోడ్రోములోనే దిగేవన్నమాట" అన్నాను నేను.

"అరగంటయి అక్కడే చక్కర్లు కొడుతున్నానుగదూ, మరీ."

"ఏడిసినట్టే వుంది".

"ఇందాకా ఆమాటేగాని, యిప్పుడు నవ్వినట్టే ఉంది". రావుకి కొంటెతనానికి మితి లేదు. నాకు కళ్ళనిండా కోపం వచ్చింది.

"నవ్వేవులే. సిగ్గులేని మొహానికి నవ్వే సింగారంట".

చచ్చా! ఎన్ని చీవాట్లు పెట్టినా మావాడి బుర్రకి ఎక్కలేదు. అదో కొత్త అనుభవం అంటాడు.



కూరల వర్తకం

చిత్రకారుడు: శ్రీ జి. సుబ్బారావు, శాంతినికేతన్.